


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

మంగళవారం 30 జూన్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3




# పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయి

-ఎస్పీ నరసింహ

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పదోన్నతి పొందిన పోలీసు సిబ్బందికి సూచించారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మ్ రిజర్వ్ (ఏఆర్) విభాగంలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న నంద కిషోర్, నాగరాజు, షేక్ రఫీ, రమేష్, కె. సతీష్, ఎం. సతీశ్, క్రాంతి, రవి నాయక్ అనే ఎనిమిది మంది సిబ్బందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ ఐపీఎస్ వారికి పదోన్నతి ఉత్తర్వులను అందజేసి, మిఠాయిలు పంచి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఉద్యోగోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని, దానితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని అన్నారు. కొత్త బాధ్యతలకు అనుగుణంగా మరింత అప్రమత్తంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.



ప్రజల మన్ననలు పొందేలా పనిచేస్తూ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు. అదేవిధంగా తోటి సిబ్బందితో సమన్వయం, పరస్పర గౌరవంతో పనిచే యాలని, సేవా భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణతో పాటు ఆరోగ్యం, కుటుంబ సభ్యుల సంక్షేమం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) జానయ్యతో పాటు ఏఆర్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం





-పేదలకు మరిన్ని సేవలు అందించాలి
-ఘనంగా లయన్స్ కంటి ఆసుపత్రి నూతన భవన పూజ కార్యక్రమం
-రాచర్ల లక్ష్మీ కాంతారావు మెమోరియల్ లయన్స్ విజన్ ఐ కేర్ ప్రారంభం

భానుపురి /సూర్యాపేట టౌన్

నిరుపేదలకు సహాయాన్ని అందించేందుకు లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మదన్ మోహన్ రేపాల అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి ఆసుపత్రి ఆవరణలో రూ. 75లక్షలతో నిర్మించిన నూతన భవన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాచర్ల లక్ష్మీకాంతారావు మెమోరియల్ లయన్స్ విజన్ ఐ కేర్ సెంటర్ ను కూడా ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని అన్నారు. వివిధ లయన్స్ క్లబ్బుల ద్వారా పేదల కొరకు మాన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే లయన్స్ క్లబ్ లకు మరింతగా మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అత్యాధునిక సదుపా యాలతో నూతన భవనాన్ని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి ఆసుపత్రి ద్వారా రికార్డు స్థాయిలో ఓపీలు చూడటం, సర్జరీలు చేయడం గర్వకారణమని ప్రశంసించారు. 2025-26 సంవత్సరంలో 37518 ఓపీలు, 2384 మందికి కంటి ఆపరేషన్ నిర్వహించటం పట్ల అభినందించారు. మరిన్ని వైద్య సదుపాయాలను కల్పించేందుకు సహకరిస్తామని తెలిపారు. అనంతరం ఈ వేడుకలకు హాజరైన అతిథులను ఘనంగా సన్మానించారు.నామవరం గ్రామం నుంచి వచ్చిన 30 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ దోసపాటి గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వుప్పల రాజేంద్రప్రసాద్, డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మీలా మహదేవ్, సెక్రటరీ రాచర్ల కమలాకర్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 2 గుడిపూడి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ సూర్యాపేట అధ్యక్షులు మిర్యాల సుధాకర్,కొండా సంతోష్, ట్రస్ట్ బోర్డు సభ్యులు బండారు రాజా, మొరిశెట్టి లక్ష్మాది, కక్కిరేణి చంద్రశేఖర్,చల్లాలక్ష్మీకాంత్, ఈగ దయాకర్, రాచకొండ శ్రీనివాస్, యామా ప్రభాకర్, డాక్టర్ శ్రీవాణి,డాక్టర్ నితీష్, మేనేజర్ మల్లిఖార్జున్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

భానుపురి /సూర్యాపేట టౌన్





ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA) సూర్యాపేట శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా డాక్టర్ రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఆనందరావు, కోశాధికారిగా డాక్టర్ డి. ఉపేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యుల సహకారంతో పనిచేస్తామని తెలిపారు. పూర్తి కార్యవర్గాన్ని జూలై 1న జరిగే పదవీ స్వీకార కార్యక్రమంలో ప్రకటించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐఎంఏ సీనియర్ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ గంట దయాకర్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణతో పాటు పలువురు వైద్యులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# సూర్యాపేట వాసికి పాండిచ్చేరి వర్సిటీ పిహెచ్‌డి ప్రదానం

భానుపురి /సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణానికి చెందిన పోతరాజు విద్యా సాగర్ ప్రతిష్టాత్మక పాండిచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టాను అందుకున్నారు. వీరు పోతరాజు విజయ రావు, జయమ్మల పెద్ద కుమారుడు ఆయన ఇమేజ్ ప్రాసెసింగ్ కోసం మెజారిటీ రివర్సిబుల్ లాజిక్ ఆధారిత యాడర్స్, మల్టిప్లయర్స్ రూపకల్పన, పనితీరు మూల్యాంకనం అనే అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంపై అంతర్జాతీయ ప్రమాణాలతో పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు సంబంధించి బుధవారం యూనివర్సిటీ సబ్జెక్ట్ నిపుణుల వారి సమక్షంలో ఆయన విజయవ ంతంగా తన ప్రజెంటేషన్‌ను పూర్తి చేసి, వారి ప్రశంసలు అందుకున్నారు. స్థానిక సూర్యాపేట విద్యార్థి జాతీయ స్థాయి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఇంతటి ప్రతిష్టాత్మక మైలురాయిని అధిగమించడం పట్ల ఆయన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. విద్యా సాగర్‌కు ముఖాముఖిగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలు మానుకోవాలి

భానుపురి/ సూర్యాపేట టౌన్

కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల జీవనోపాధికి ఆధారమైన ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను వెంటనే విరమించుకోవాలని, గ్రామీణ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న వి.బి.జి. రాంజీ బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 1న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది నిరుపేద కుటుంబాలకు ఉపాధి, ఆదాయ భరోసా కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని అమలు పరచడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పని దినాలను తగ్గించడం, నిధుల విడుదలలో జాప్యం, కూలీలకు వేతనాలు ఆలస్యంగా చెల్లించడం వంటి చర్యల వల్ల గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో వి.బి.జి. రాంజీ బిల్లు అమల్లోకి వస్తే గ్రామీణ ఉపాధి వ్యవస్థ మరింత దెబ్బతినే ప్రమాదం



ఉందని, పేదలు, వ్యవసాయ కార్మికులు, చిన్న రైతుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. జులై 1న జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో గ్రామీణ కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్దఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు గట్టి హెచ్చరిక ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలను ప్రతి మండలం, గ్రామంలో విజయవంతం చేసి ప్రజల ఐక్యతను చాటాలని కోరారు. ఈ సదస్సుకు అధ్యక్ష వర్గంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లె వెంకట్ రెడ్డి వ్యవహరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు శీలం శీను, వట్టపు సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పులుసు సత్యం, పోసనబోయిన హుస్సేన్, జంపాల స్వరాజ్యం, సోమపంగా జానయ్య, కడెం కుమార్, గుంజ వెంకటేశ్వర్లు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు నాయకులు మిట్ట గడుపుల ముత్యాలు, రణపంగా కృష్ణ, వల్లపు దాసు సాయికుమార్, శివకృష్ణ, దశరథ, మామిడి సుందరయ్య, ఆరే రామకృష్ణారెడ్డి, దేవరకొండ యాదగిరి, ఇరుగు రమేష్, బుడిగె ధనుంజయ్ గౌడ్, బచ్చల కూర స్వరాజ్యం, యాతాకుల వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ వానాకాలం వన మహోత్సవమునకు శాఖల వారీగా టార్గెట్స్ పూర్తి చేయాలని ప్రతి శాఖల అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు ప్రత్యేక దృష్టితో శాఖల వారీగా అధికారులు పూర్తిచేయాలని , ప్రజా పాలన - కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వాడకం పై అవగాహన కల్పించడంలో మహిళా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ బాగా కృషి చేశారని వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానని, ప్రతి కాలేజీ, స్కూళ్లలో డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని అలాగే రోడ్డు భద్రత గురించి సంక్షేమ హాస్టల్స్ లో, కాలేజీ, పాఠశాలలో అవగాహన సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు రోడ్డు భద్రతపై సూచనలు చేయాలని, ఎన్ హెచ్ 65, కూడ కూడ రోడ్డులో అక్కడక్కడ రోడ్డు పాడైపోయి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నందువలన ఎన్ హెచ్ -65 అధికారులు, మున్సిపల్ ఇంజనీర్ సిబ్బంది సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన



ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 53 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 9, డిఇఓ 5, డీపీఓ 3, మిగిలిన 28 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డి ఆర్ ఓ ప్రేమ్ రాజు, డిఆర్డిఓ పి డి సన్యాసయ, జడ్పీ సీఈఓ శిరీష, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్దార్థ్, సిపిఓ కిషన్ నాయక్,డిఇఓ అశోక్ , సి పి ఓ కిషన్ నాయక్ ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు

## 104 సిబ్బంది కి వేతనాలు మంజూరు చేయాలి



భానుపురి/ సూర్యాపేట టౌన్

దీర్ఘ కాలికంగా వైద్య శాఖలో పని చేస్తున్న 104 ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని, అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు.. సోమవారం వైద్యశాల సూపర్నెండెంట్ పి శ్రావణ్ కుమార్ కు 104 సిబ్బంది వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన 104 పథకం వల్ల ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఎమర్జెన్సీ సర్వీస్ అందించిన 104 సిబ్బంది కి నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు.. ఏప్రిల్ 15 నుండి కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వలేదని, రీ డిప్లాయ్మెంట్ కింద ఇతర జిల్లాల్లో పని చేస్తున్న సిబ్బందిని స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు... వేతనాలు మంజూర్ చేయాలని ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చిన ఫైనాన్స్ శాఖ రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పడం అన్యాయం అన్నారు... జులై 5 లోపల సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెకు దిగుతామని, దానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని నెమ్మాది హెచ్చరించారు...ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగునాయక్, నాగలక్ష్మి, నాగమణి, సురేష్ తదితరులు ఉన్నారు

## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదుల పరిష్కారానికి కృషి

భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. దొచట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# బియ్యం ఎగుమతులకు ప్రోత్సాహక విధానం తీసుకొస్తాం

భానుపురి /హైదరాబాద్

తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎగుమతి ప్రోత్సాహక విధానాన్ని రూపొందిస్తున్నట్లు సాగునీటి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతులు, రైస్ మిల్లర్లకు అధిక లాభాలు చేకూరేలా విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రత్యక్ష ఎగుమతులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో సోమవారం కేపీసీ న్యూట్రి సంస్థ రూపొందించిన మల్టీ-విటమిన్ రైస్ ఉత్పత్తిని ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. పోషకాహారంతో కూడిన బియ్యం ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా, రైతులకు అదనపు ఆదాయం అందించే అవకాశాలను సృష్టిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న బియ్యానికి కొత్త మార్కెట్లను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నప్పటికీ, ఎగుమతుల కోసం కొనుగోలు చేయడం లేదని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఎగుమతులను ప్రోత్సహించే ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎగుమతులకు ముందుకు వచ్చే రైస్ మిల్లర్లు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన అనుమతులను సులభంగా అందిస్తామని హామీ ఇచ్చారు. యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం దేశంలోనే ఒక రికార్డు అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భౌగోళికంగా పెద్ద రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని గుర్తుచేస్తూ, తెలంగాణలో వరి, బియ్యం ఉత్పత్తి ఏ స్థాయిలో పెరిగిందో ఈ గణాంకాలే చెబుతున్నాయని అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైస్ పరిశ్రమలో వినూత్న ఉత్పత్తులు అభివృద్ధి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మల్టీ-విటమిన్ రైస్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులకు దేశీయంగానే కాకుండా విదేశీ మార్కెట్లలో కూడా మంచి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో తయారయ్యే బియ్యం ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్లలో విక్రయించేందుకు ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తుందని, రైతులు, ఆహార



ప్రాసెసింగ్ రంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో విలువ ఆధారిత బియ్యం ఉత్పత్తిని ప్రారంభించడం సంతోషకరమని పేర్కొంటూ నిర్వాహకులను మంత్రి అభినందించారు.

# ఘనంగా జాతీయ గణాంక దినోత్సవము

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్



భారతదేశ ప్రఖ్యాత గణాంక శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ ప్రొఫెసర్ ప్రసాంత చంద్ర మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని 20వ జాతీయ గణాంక దినోత్సవం--2026 కార్యక్రమాన్ని సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ (×ణూజ)లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలో ఆధునిక గణాంక వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు మహలనోబిస్ అని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమర్థవంతమైన ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో విశ్వసనీయ గణాంకాల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఖచ్చితమైన అధికారిక గణాంకాల ఆధారంగానే అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. ప్రేమ్ రాజు, ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్. కిషన్, డీటీడబ్ల్యూఓ శంకర్, డీఎంఅండ్ హెచ్‌వో వెంకటరమణ, డీపీవో యాదగిరి, గణాంక అధికారులు పి. రమేష్, వి. రామారావు, ఉప గణాంక అధికారులు రాజేష్, కోటేశ్వరరావు, నరేందర్, లింగయ్య, అశోక్, పర్యవేక్షకుడు దున్న శ్యామ్, మండల ప్రణాళికా, గణాంక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక సూర్యాపేట సర్వోత్తమ రెడ్డి దే

భానుపురి/ సూర్యాపేట రూరల్



గత ఎన్నికల్లో మా రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డి ఇంత చురుకుగా ఉంటే సూర్యాపేట మిస్ అయ్యేది కాదని ఈసారి బుల్లెట్ దిగుద్దని ఇక సూర్యాపేట మిస్ కాదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దామన్న తనయుడు సర్వోత్తమ్ రెడ్డి గురించి మాట్లాడారు. దామన్న అమరత్వం పొందే వరకు ఆయన వ్యక్తిత్వాన్ని దగ్గర నుంచి చూసిన నాయకుల్లో నేను ఒకడినని దామన్నను దూరం నుంచి చూసి పులి అని భయపడేదని కానీ దగ్గర నుంచి చూస్తేనే దామన్నకు ప్రజల పట్ల ఉన్న అంకితబావం తెలిసిందన్నారు. తనను నమ్మిన ప్రజల కోసం వందలాది ఎకరాల భూమిని, ఆస్థులను దారపోసిన ఏకైక కాంగ్రెస్ నాయకుడు దామోదర్ రెడ్డి అన్నారు. దామన్న బాటలోనే ఆయన తనయుడు సర్వోత్తమ్ రెడ్డి ప్రజలకు సేవ చేస్తానని నాన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతానని ప్రజలకు అండగా ఉంటానని మీ ముందుకు వస్తున్నాడన్నారు. విజ్ఞానవంతుడు మీ కోసం నిలబడే కమిట్ మెంట్ ఉన్న వ్యక్తి సర్వోత్తమ్ రెడ్డి అని అవినీతి రహిత పాలన అందించాలనే ఆలోచనతో వస్తున్న ఇలాంటి నాయకుడికి మనమంతా అండగా ఉండాలన్నారు. సర్వోత్తమ్ రెడ్డికి ఇప్పటికే ఉత్తమన్న అండ దండ మెండుగా ఉందని ఉత్తమన్న నాయకత్వంలో ముందుకు పోతుందని మా అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి చాలా చక్కగా పని చేసుకుంటూ పోతుండనే అభిప్రాయం ఉందన్నారు. మంత్రుల అండదండలు సర్వోత్తమ్ రెడ్డి కి ఉన్నాయని ప్రజలంతా సర్వోత్తమరెడ్డిని ఆదరించి వెంట నడవాలని పిలుపునిచ్చారు.

# వ్యక్తిత్వాన్ని కాదు.. విధానాలను విమర్శించాలి: జగదీష్ రెడ్డి




భానుపురి /హైదరాబాద్

రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు, శారీరక లక్షణాలను అవమానించే వ్యాఖ్యలకు తావు ఉండకూడదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. మనుషుల ఎత్తు, పొడుగు వంటి వ్యక్తిగత అంశాల గురించి మాట్లాడేది సబ్జెక్ట్ లేని వారు, సంస్కారం లేని వారేనని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చేసిన తాజా ప్రసంగానికి స్పందిస్తూ జగదీష్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి అంశాలపై చర్చ జరగాల్సిన సమయంలో వ్యక్తిగత వ్యాఖ్యలకు దిగడం ప్రజాస్వామ్య రాజకీయాలకు ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు రాజకీయ నాయకుల నుంచి హుందాతనం, సంయమనం, బాధ్యతాయుతమైన భాషను ఆశిస్తారని పేర్కొన్న ఆయన, రాజకీయ విభేదాలు ఉన్నా వ్యక్తిత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపే చర్చలే రాజకీయాల్లో ప్రాధాన్యం పొందాలని సూచించారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం, హుందాతనం కొనసాగితేనే ప్రజాస్వామ్య విలువలు బలోపేతమవుతాయని, వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా ప్రయోజనాలపై నిర్మాణాత్మక చర్చలు జరగడం సమాజానికి మేలు చేస్తుందని ఆయన అన్నారు. జగదీష్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయాల్లో మర్యాదపూర్వక సంభాషణ అవసరాన్ని గుర్తుచేస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు పరస్పర గౌరవంతో ప్రజా సమస్యలపై చర్చించడం ప్రజాస్వామ్య సంస్కృతిని మరింత బలోపేతం చేస్తుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

# జగదీష్ రెడ్డిపై సీఎం వ్యాఖ్యలు సరికాదు

-బడుగుల లింగయ్య యాదవ్

భానుపురి /సూర్యాపేట టౌన్



నల్లగొండ సభలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. బడుగుల మాట్లాడుతూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు. బూతుపురాణాలతో సీఎం హోదాను దిగజార్చుతున్నారు. ఉమ్మడి జిల్లా రూపురేఖలు మార్చిన ఘనత మా జగదీష్ రెడ్డి ది అని అన్నారు. కేసీఆర్ హయాంలో పదేండ్లు మంత్రిగా జగదీష్ రెడ్డి చేసిన అభివృద్ధి కండ్ల ముందే కనిపిస్తుంది. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏందో చెప్తారా? సీఎం హోదాలో రేవంత్ రెడ్డి రెండుసార్లు వచ్చి ఏమన్నా ఇచ్చిండా? పదేండ్లు మంత్రిగా జగదీష్ రెడ్డి ఏం చేసిండో గంటల తరబడి చెబుతాం. కాంగ్రెస్‌వాళ్లు చేసిన అభివృద్ధి ఒక్కటన్నా చెప్పగలరా? అని ప్రశ్నించారు. పేమెంట్ ముఖ్యమంత్రి.. మా అభివృద్ధి నాయకుడిని విమర్శించడం సిగ్గుచేటు. బూతుపురాణాల రేవంత్ మాటలకు ప్రజలు చీదరించుకుంటున్నారు. ఖబర్దార్ రేవంత్.. నోరు అదుపులో పెట్టుకో. మరోమారు మా మాజీ మంత్రి జగదీష్ రెడ్డి గురించి నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోం. మా నాయకుల మీద ఏడుపు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టు అని బడుగుల హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కొప్పుల వేణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన యువత

భానుపురి/ సూర్యాపేట టౌన్



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ని వ్యవసాయమార్కెట్ లో వెన్న ఉపేందర్ నాయుడు ఆధ్వర్యంలో యువత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ వార్డు అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధితో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందర్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కుందమల్ల శేఖర్, మాజీ ఉమ్మడి నల్గొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అయూబ్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదుగుల నవీన్, షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్, పిండిగ విజయ్ కుమార్, గోలి రాంరెడ్డి, ఆకుల రాజేష్, అదిమల్ల కృష్ణ, బొల్లం వెంకన్న, పట్టణ కాంగ్రెస్ నాయకులు షేక్ రహీం, కోడి కిరణ్, పగిడిమర్రి నవీన్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రతి ఎకరానికి నీరు అందజేయడమే లక్ష్యం

భానుపురి /సూర్యాపేట రూరల్



ప్రతి ఎకరానికి నీరు అందజేయడమే లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట మండలం రత్నాపురం ఎడమకాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తామన్నారు. మూసీ ఆయకట్టు కింద పొలాలకు రెండు పర్యాయాలుగా నీరందిస్తామన్నారు. వానాకాలంలో ప్రాజెక్టు కింద 35 వేల ఎకరాల మేర సాగు నీరందుతుందన్నారు. ఈ ఏడాది వర్షాలు ఏక్కువగా ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో కురిసిన వర్షంతో మూసీ ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు చేరిందన్నారు. ప్రస్తుతం మూసీ ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల నీరుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కోట్ల రూపాయలతో ఎడమ కాల్వల మరమ్మతుల పనులు,క్రస్ట్‌గేట్లు ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. మూసి ప్రాజెక్టు ను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎలాంటి ఆటంకాలు ఎదురైనా అధిగమించి మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని నిన్నటి సభలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిజిల్లా మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారన్నారు. మూసీ నది ప్రక్షాళన చేయాలన్నది రేవంత్ రెడ్డి కల అని అన్నారు.

# సంపద సృష్టించే కార్మికులే రేపటి చరిత్ర నిర్దేశకులే

భానుపురి/సూర్యాపేట టౌన్




సంపద సృష్టించే కార్మికులే రేపటి చరిత్ర నిర్దేశకులు అవుతారని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయం ధర్మ బిక్షంభవన్లో ఏఐటీయూసీ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహించి మతోన్మాద బిజెపి ఎన్డీఏ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కార్మికుల హక్కులను కాలరాస్తున్న పాలకులపై పోరాడాలని ఆయన కార్మికుల లోకానికి పిలుపునిచ్చారు హమాలీలకు సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని ఆయన అన్నారు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని యూనియన్ పెట్టుకునే హక్కును ప్రతి కార్మికుడికి ఇవ్వాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా అప్పజెప్పే కార్యక్రమానికి స్వస్తి చెప్పాలని కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు స్వతంత్రానికి పూర్వం సాధించుకున్నా 42 రకాల కార్మికుల హక్కులను తీసివేసి నాలుగు కోడలుగా విభజించడం భావ్యం కాదని ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానం అవలంబిస్తున్న బిజెపి ఎన్డీఏ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారులు చామల అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె లతీఫ్ శ్యాంసుందర్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి కోశాధికారి ఎస్ రాఘవరెడ్డి ,సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, చివెంముల మండల కార్యదర్శి రాము, ఏఐటియుసి నాయకులు వీరభద్రాచారి రన్మియా దిగుమతి హమాలి యూనియన్ నాయకులు సైదులు గౌడ్ఎడెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





భానుపురి/యాదాద్రి భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండల ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, నూతనంగా నిర్మించిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గట్టు మైసమ్మ ఆలయం వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం మాల్యాల గ్రామం నుండి బొమ్మలరామారం మండల కేంద్రం వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అలాగే మాల్యాల గ్రామం నుండి ధర్మరెడ్డిగూడెం గ్రామం వరకు నూతనంగా నిర్మించిన బీటీ రహదారిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులు ఎంతో కీలకమని పేర్కొంటూ, నూతనంగా నిర్మిస్తున్న మరియు రెన్యూవల్ చేస్తున్న ఈ రహదారులు పూర్తయితే ప్రజల ప్రయాణం సౌకర్యవంతంగా మారడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థులు, ఉద్యోగులు,



అత్యవసర సేవలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజల దీవెనతో సభ విజయవంతం

-నల్గొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత



భానుపురి/నల్గొండ:

ప్రజల దీవెనలతో ఆదివారం నాడు నల్గొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ విజయవంతం అయ్యిందని నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత అన్నారు. సోమవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో కైలాష్ నేత మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ఆదరణ కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని రుజువు అయిందని, దీనితో ప్రతిపక్షాలు దిక్కుతోచక అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. దేశంలోనే ఆదర్శ పాలన అందిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ మరోసారి తెలంగాణ ప్రజలు ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేసారు. పది సంవత్సరాలుగా కేసీఆర్ పాలనలో నల్గొండ జిల్లాకు చేకూరిన ప్రయోజనం శూన్యమని నేటి రెండున్నర సంవత్సరాలుగా పాలనలో వేల కోట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ది అన్నారు. ఎస్ ఎల్ బి సి టన్నెల్,నెల్లికల్, కిష్ట రాంపల్లి రిజర్వాయర్, బ్రాహ్మణ వెల్లంల,చర్లగూడెం రిజర్వాయర్, లను పూర్తి చేయకుండా నల్గొండ రైతులను వంచించిన బిఆర్ఎస్ నేడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరం అన్నారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులను రాజు చేస్తామని సీఎం హామీ ఇవ్వడం సీఎం కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ చైర్మన్ జిల్లపల్లి పరమేష్,ఎండి ముంతాజ్ అలీ, మేకల రాజేందర్ రెడ్డి,దామనూరి అశోక్, చర్లపల్లి గౌతం, పగిళ్ల రాజు, వేముల గోపీనాథ్, వెంకటరత్నం, గుర్రం కోటేష్, ఎండి అజీస్, సయ్యద్ నాగుల్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.